

భవన నిర్మాణ కార్మికులకు భరోసా కరవు

నేటికీ సంక్షేమ బోర్డు పునరుద్ధరించని చంద్రబాబు



అల్లిపురం సింహాల దేవిడి వద్ద పనుల కోసం వేచి ఉన్న కార్మికులు

- హామీలు విస్మరించిన కూటమి పాలకులు
- ఆర్థిక ఇబ్బందులతో కార్మికుల అవస్థలు
- ప్రభుత్వంపై కార్మిక సంఘాల మండిపాటు

దాబాగార్డెన్స్: ''భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలన్నీ పరిష్కరించేస్తాం.. కార్మికులకు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తాం.. సహజ మరణానికి రూ.60 వేలు.. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు.. అదనంగా మట్టి ఖర్చులకు మరో రూ.20వేలు.. ఇవి కాక మహిళా కార్మికుల తొలి కాన్పుకు రూ.20వేలు.. రెండో కాన్పునకు మరో రూ.20వేలు చెల్లిస్తాం.. అంగవైకల్యం పొందితే రూ.5 లక్షలు.. కార్మికుడు అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే నెలకు రూ.3వేలు చొప్పున పరిహారం అందిస్తాం.. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికులకు పెన్షన్ రూపంలో సంక్షేమ బోర్డు ద్వారా సాయం అందిస్తాం..'' ఇలా ఎన్నో హామీలను ఎన్నికల సమయంలో కూటమి నాయకులు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు 15 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు ఎక్కడా అమలు చేయడం లేదు. అసలు వాటి ప్రస్తావనే తీసుకురావడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తే...

గతంలో మాదిరిగా భవన నిర్మాణ రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తే బడుగు జీవులకు సాయమందేది. ఫలితంగా కార్మికుడు ప్రమాదవశాత్తు గాయపడినా.. అనారోగ్యంతో మంచం పట్టినా సంక్షేమ బోర్డు ద్వారా ఎంతో కొంత ఆర్థికంగా సాయమందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పటికీ సంక్షేమ బోర్డు నేటికీ పునరుద్ధరించలేదు. భవన నిర్మాణ రంగ కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పడి సుమారు 15 నెలలు కావస్తున్నా కనీస భరోసా కల్పించలేదు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయకపోవడంతో భవన నిర్మాణరంగ కార్మికులు గుర్రుగా ఉన్నారు.

ఆదుకునే నాథుడు లేక దుర్భర జీవనం

రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికులు చంద్రబాబు ప్రభుత్వ తీరుతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం శ్రమిస్తేనే యావత్ కుటుంబం కడుపు నిండేది... అలాంటి కష్టజీవులు చంద్రబాబు తీరుతో ఇబ్బందులు పడతున్నారు. ఇప్పటి వరకు ఇసుక సరఫరా కొరత, భవన నిర్మాణ రంగ సామగ్రి ధరల పెరుగుదలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా భవన నిర్మాణ రంగంపై ఆధారపడి ఉన్న కార్మికుల జీవితాల్లో కారు చీకట్లు నిండుకున్నాయి. మరోవైపు కార్మికుడు పనిచేసే చోట ప్రమాదం జరిగితే ఆదుకునే నాథుడే కరువయ్యాడు. మహా అయితే కాంట్రాక్టర్లు ఎంతో కొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప బాధితుని కుటుంబానికి ఎవరూ భరోసా కల్పించడం లేదు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఆర్థికంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడతున్నారు. ఆస్పత్రి పాలైనా.. మంచం పట్టినా తేరుకునే వరకు అప్పులపాలవుతున్నాడు. ఓ వైపు కుటుంబానికి పెద్ద దిక్కులా ఉండే కార్మికుడు మంచాన పడితే ఆ కుటుంబం బతుకు బండి సాగడం లేదు. ఇంటిల్లపాదీ దుర్భర జీవితం సాగిస్తున్నారు.



సింగ్ హోటల్ జంక్షన్ వద్ద భవన నిర్మాణ రంగ కార్మికులు



కార్మికుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు

ఓ వైపు ఇసుక కొరతతో పనుల్లేక కార్మికులు ఇంత వరకు బాధలు పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇసుక దొరుకుతుందనుకుంటే భవన నిర్మాణ రంగ సామగ్రి ధరలకు రెక్కలొచ్చాయి. ధరలు అందుబాటులో ఉంటే ఎవరైనా నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకొస్తారు. నిర్మాణాలు జోరందుకుంటే కార్మికులకు పనులు దొరుకుతాయి. కానీ ధరలు తగ్గించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదు. మరోవైపు కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చినా నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదు. కార్మికులను ఆదుకుంటామని చంద్రబాబు హామీలిచ్చినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు తక్షణమే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ పరిష్కరించాలి. – కోట సత్తిబాబు, ఏఐటీయూసీ

క్లుప్తంగా

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 (టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్-యూబీఐఎన్ 0806081)కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఇ-మెయిల్ ఐడీ endow&eokanaka@gov.in ద్వారా వివరాలు పంపించాలి.

సేవలకు గుర్తింపుగా సత్కారం



కీర్తి పట్నాయక్‌ను సత్కరిస్తున్న పైడా కృష్ణప్రసాద్, నిర్వాహకులు

దాబాగార్డెన్స్: నిరంతరం పేద ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తిస్తూ శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ ట్రస్ట్ అధినేత కీర్తి పట్నాయక్‌ను దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ 27వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని సోమవారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా సత్కరించారు. పైడా కళాశాలల అధినేత పైడా కృష్ణప్రసాద్ పలువురు ప్రముఖులు, అకాడమీ ప్రతినిధుల చేతుల మీదుగా విశాఖరత్న అవార్డును కీర్తి పట్నాయక్‌కు అందజేశారు.

హత్యాయత్నం కేసులో మరొకరి అరెస్ట్

దాబాగార్డెన్స్: పాతనగరం చిలకపేట ప్రధాన ద్వారం వద్ద గత నెల 17న అర్ధరాత్రి నాటు తుపాకీతో రాజేష్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో వన్‌టౌన్ పోలీసులు సోమవారం మరో వ్యక్తిని అరెస్టు చేశారు. రాజేష్‌పై హత్యాయత్నం కేసులో ఏ1 ముద్దాయికి ఆయుధం సరఫరా చేసిన ఏ4 ముద్దాయి వేణుగోపాల్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ జీడీ బాబు తెలిపారు.

అధ్యయన యాత్రలతో ప్రయోజనం శూన్యం

అల్లిపురం: జీవీఎంసీ ప్రస్తుత పాలకవర్గం అధికారం చేపట్టిన 2021 నుంచి ఇప్పటి వరకు నాలుగుసార్లు చేపట్టిన అధ్యయన యాత్రలపై కమిషనర్, పాలకవర్గం శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యయనాల పేరుతో విహార యాత్రలు చేస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ల విహార యాత్రల వల్ల విశాఖ నగరాభివృద్ధికి, ప్రజలకు ప్రయోజనం లేదన్నారు. ఈ యాత్రలకు ఖర్చు చేస్తున్న కోట్లాది రూపాయలు తాగునీరు, విద్యుత్, రహదారులు, వైద్యం తదితర సదుపాయాల కల్పనకు ఉపయోగిస్తే ప్రజలకు మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

ఏయూ బొటానికల్ గార్డెన్ పరిశీలన



ఫీల్డ్ ట్రిప్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విద్యార్థినులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా సోమవారం ఏయూ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫీల్డ్ ట్రిప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల ప్రారంభించారు. విద్యార్థినులు, వృక్షశాస్త్ర అధ్యాపకులు ఏయూ వృక్షశాస్త్ర విభాగాన్ని సందర్శించి, అక్కడి బొటానికల్ గార్డెన్‌లో వివిధ వృక్ష జాతులపై అవగాహన పొందారు. జాతీయ గుర్తింపు పొందిన మ్యూజియంలో వెయ్యి రకాల స్పెషిమన్స్‌ను సందర్శించారు. హెర్బేరియంలో అరుదైన, అంతరించిపోతున్న స్పెసిమన్‌లు పరిశీలించి అవగాహన పొందారు. ఫీల్డ్ ట్రిప్‌లో కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎంఏ నివేదిత, డాక్టర్ జె.లావణ్య, మహాలక్ష్మి పాల్గొన్నారు.

22 నుంచి వాసవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసియున్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి వాసవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల పోస్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు మాట్లాడుతూ అమ్మవారి మూలవిరాట్‌ను రోజుకో అవతారంలో విశేషంగా అలంకరించి కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్టు చెప్పారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు స్వయంగా అమ్మవారిని దర్శించుకుని పూజాదికాలతోపాటు గోత్రనామాలు ముందుగా దేవాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. రోడ్డు విస్తరణ కారణంగా ఆలయానికి ప్రధాన భాగాలైన ధ్వజస్తంభం, నవగ్రహ మండపం పోయినందున పునర్నిర్మించాల్సి ఉందన్నారు. అందువల్ల నూతనంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో అమ్మవారిని ప్రతిష్ఠింపజేసినట్టు తెలిపారు. రోజూ తెల్లవారుజామున ప్రత్యేక పంచామృతాభిషేకాలు, హోమాలు, మహిళలచే సామూహిక కోటి కుంకుమార్చన నిర్వహించనున్నట్టు చెప్పారు. శరన్నవరాత్రుల ఉత్సవాల ప్రారంభ సూచికగా ఈ నెల 22న ఉదయం 6 గంటలకు కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహానికి కనక మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించి, అక్కడి నుంచి దేవాలయం వరకు 108 మంది మహిళలచే ఊరేగింపుగా తీసుకొస్తామని తెలిపారు.

వైభవంగా కృష్ణాష్టమి



విశేష అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం కృష్ణాష్టమి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామిని అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు విశేషంగా అలంకరించారు. స్వామి వారికి విశేష అర్చనలు చేపట్టారు, భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. వైష్ణవ సంప్రదాయంలో స్వామికి పూజలు నిర్వహించి, పాలు, వెన్న తదితర ప్రసాదాలు నివేదించారు. సాయంత్రం స్వామి వారికి విశేష హారతులు ఇచ్చారు.

గణపతి లడ్డూ @ రూ.1,00,001

దక్కించుకున్న వైఎస్సార్ సీపీ 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి



గణపతి లడ్డూతో భీశెట్టి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, తదితరులు

దాబాగార్డెన్స్: వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో దొండపర్తిలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గణపతి లడ్డూని వేలంపాటలో వైఎస్సార్ సీపీ 42వ వార్డు అధ్యక్షుడు భీశెట్టి ప్రసాద్ రూ.1,00,001కి దక్కించుకున్నారు. అనంతరం ఆ లడ్డూను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌కు అందించారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ గణపతి ఆశీస్సులు వాసుపల్లి గణేష్‌కుమార్‌పై ఉండాలని, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మళ్లీ సేవలందించాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు. వరసిద్ధి వినాయక పూజ మహోత్సవ కమిటీ సమక్షంలో ఆదివారం రాత్రి పెద్ద ఎత్తున అనుపోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఛైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ఇంజినీర్లకు సత్కారం



జీవీఎంసీ ఇంజినీర్లను సత్కరించిన మేయర్, డిప్యూటీ మేయర్ ఇతరులు

దాబాగార్డెన్స్: ఇంజనీర్లు దేశ ప్రగతికి పునాది అని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ ఇంజనీర్లను డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరావుతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇంజనీర్లను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప ఇంజనీరని, దేశాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్ సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్లు దిలీప్, మురళీకృష్ణతో పాటు పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి రూ.5 వేల సాయం



బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, తదితరులు

అల్లిపురం: ఆసరా లేని పేద కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. 34వ వార్డుకు చెందిన చెన్నా యల్లయ్యమ్మ ఇటీవల భర్తను కోల్పోయింది. కుమారుడు చెన్న దాసు అనారోగ్యంతో మంచానపడ్డాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ద్వారా విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ సోమవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించి మనోధైర్యం నింపారు. అధైర్య పడవద్దని, తానున్నానంటూ తక్షణమే రూ.5 వేలు అందించారు. వైద్య పరంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల శ్రీనివాస్, లింగం శ్రీను, ఎర్నిమాంబ ఆలయ కమిటీ ఛైర్మన్ లండ రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు మార్గదర్శక నిలయాలు



ఉద్యోగాలు సాధించిన వారితో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు, తదితరులు

దాబాగార్డెన్స్: గ్రంథాలయాలు మార్గదర్శక నిలయాలని, ఎంతో మంది విద్యార్థుల జీవితాలు ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాయని విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేరై ఏపీ పోలీస్ శాఖ, విద్యాశాఖ డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారిని సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఎంతో కష్టపడి పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యారని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. వారి కష్టానికి తగిన ఫలితం లభించిందని, అందుకు ప్రత్యేక నిదర్శనం మీ ముందున్న 55 మంది పోలీస్ కానిస్టేబుల్, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందడమేనన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జ్ఞాపికలు అందజేశారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలి



నిరసన తెలుపుతున్న రజక సంఘం నాయకులు

బీచ్‌రోడ్డు: రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సమస్యలపై సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ విశాఖ జిల్లాలో రజక వృత్తిదారులు సుమారు 50 వేల మంది ఉన్నారన్నారన్నారు. వారికి పక్కా ఇళ్లు, దోబీగాట్లు లేవని, లాండ్రీ పని చేయుటకు స్థలాలు లేవన్నారు. కుల వృత్తి చేసుకునే అవకాశం లేక నగరంలోని అపార్ట్‌మెంట్స్‌లో వాచ్‌మెన్‌గా, ఇంటి పని వారిగా చేస్తూ జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులపై అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, చీటింగ్ కేసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారన్నారు. వాటి నుంచి రక్షణ కోసం రజకులకు సామాజిక రక్షణ చట్టం చేయాలని కోరారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే రజక వృత్తిదారులంతా జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.అప్పారావు, ఈశ్వరరావు, కోటిబాబు పాల్గొన్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

అల్లిపురం: స్విగ్గీ, జొమాటో రైడర్లు ప్రతీ శని, ఆదివారాల్లో సమ్మె చేయాలని అఖిల భారత గిగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పిలుపునిచ్చింది. ఈ మేరకు జగదాంబ దరి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడారు. సమ్మె వంద శాతం విజయవంతమయ్యేందుకు రైడర్లు ప్రదర్శించిన ఐక్యత, పోరాటాన్ని అభినందించారు. స్విగ్గీ యాజమాన్యం చర్చలకు వస్తుందో..? లేదో..? వేచి చూడాలన్నారు. జొమాటో యాజమాన్యం ఇచ్చిన హామీలు బుధవారం నాటికి అమలు చేస్తుందో..? లేదో..? గమనించాలన్నారు. వారిచ్చిన హామీలు నిలబెట్టుకోకుంటే శని, ఆదివారాల్లో విధులు బహిష్కరించాలని సూచించారు.


బీచ్‌ను నిత్యం శుభ్రపరచండి



బీచ్‌లో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: బీచ్‌లో వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగిస్తూ శుభ్రపరచాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సీఎస్సార్ నిధులతో సమకూర్చిన నూతన బీచ్ స్వీపింగ్ యంత్రాన్ని సోమవారం ఆర్కే బీచ్‌లో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో సుందరమైన విశాఖ సాగర తీరానికి పర్యాటకులు, సందర్శకులు నిత్యం వస్తుంటారని, వారికి ఆహ్లాదం, ఆనందం అందించాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందన్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు ఎక్కడా వ్యర్థాలు కనిపించకూడదని, నిత్యం జోనల్ కమిషనర్లు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వీపింగ్ యంత్రాల పనితీరు నిత్యం పరిశీలించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. బీచ్‌లో సందర్శకులు అధికంగా ఉన్న ప్రదేశాల్లో వ్యర్థాలు ఎక్కువ ఉంటున్నందున ప్రస్తుతం ఉన్న 7 స్వీపింగ్ మిషన్లను కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి బీచ్ వరకు వినియోగించాలని ఆదేశించారు. బీచ్ స్వీపింగ్ యంత్రాల పనితీరు, సిబ్బంది విధులు, వారి హాజరు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, బీచ్‌లో ఎక్కడా పరిశుభ్రత కనిపించడం లేదని, విధి నిర్వహణలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. బీచ్ స్వీపింగ్ యంత్రాల నిర్వాహక ఏజెన్సీ ఫామ్‌టెక్ ప్రతినిధిపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పౌర్ణమి, అమావాస్య రోజుల్లో ఆటుపోట్లు సమయంలో వ్యర్థాలు సముద్ర తీరం నుంచి అధికంగా వస్తాయని, ఆయా సమయాలు గమనించి ముందస్తు ప్రణాళికలతో శుభ్రం చేయించాలని ఫామ్‌టెక్ ప్రతినిధులను ఆదేశించారు. బీచ్ స్వీపింగ్ సమయాల్లో అడ్డంకులు ఉన్నట్టయితే అవసరమైన చోట ర్యాంపుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ గోవిందరావును ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, మల్లయ్యనాయుడు, కార్యనిర్వాహక ఇంజినీర్ రత్నాకర్‌రెడ్డి, సహాయక వైద్యాధికారులు బి.ప్రసాదరావు, కృష్ణంరాజు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీరామ్మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ



అభివృద్ధి పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, కోడిగుడ్ల శ్రీధర్, అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో చేపట్టిన అభివృద్ధి పనులను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ సోమవారం జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో పనులు చేపట్టేటప్పుడు ప్రలోభాలకు, బెదిరింపులకు భయపడవద్దని, లంచాలు ఇవ్వొద్దని, నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. తన పదవీ కాలంలో ఇప్పటి వరకు 90 శాతం హామీలు నేరవేర్చానని, మిగిలిన 10 శాతం పూర్తి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణీరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఏఈ డి.సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయండి

మహారాణిపేట: విశాఖ జిల్లాలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు కోరారు. ఈ మేరకు జిల్లా కమిటీ తరఫున కలెక్టర్‌కు సోమవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, పిల్లలు, విద్యార్థులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాళ్లంతా గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తోందని వాపోయారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లో నిల్చునేందుకు కూడా ఖాళీ లేని పరిస్థితి ఉందని, డ్రైవర్లు, కండక్టర్లు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. బస్సుల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయన్నారు. పాలకులు స్పందించి అవసరమైన బస్సులు పెంచాలని కోరారు.

ఇంటింటికీ చంద్రబాబు ప్రభుత్వ మోసాలు



వివేకానంద కాలనీలో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు పార్టీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వార్డులోని 73వ నంబరు బూత్ పరిధిలో గల వివేకానంద కాలనీలో గడప గడపకు వెళ్లి చంద్రబాబు ప్రభుత్వ మోసాలను ప్రజలందరికీ వివరించారు. సూపర్ సిక్స్ హామీలు విస్మరించిన విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పచ్చరపల్లి రాము, హేమాలక్ష్మి, బూరుల చిన్న, శ్రీ వెంకటేశ్వర టెంపుల్ మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, పీవీ శిరీష, పీవీఎన్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాల నారాయణ రెడ్డి, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, సిద్ధేశ్వరరావు, కనిగిరి సంతోష్ కుమార్, బాడుగుల శ్రీనివాసరావు, ధర్మారావు, శ్రావణి పాల్గొన్నారు.

జోన్-5 పీజీఆర్ఎస్‌కు రెండే వినతులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 జ్ఞానాపురం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు రెండే వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులను స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి -1, ఇంజినీరింగ్ విభాగానికి -1 చొప్పున వినతులు రాగా, ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.